క్లుప్తంగా

ఘనంగా ఘటాల ఊరేగింపు



ఘటాల ఊరేగింపు

భామిని: మండల కేంద్రంలోని కోటదుర్గమ్మ సన్నిధిలో ఏర్పాటు చేసిన ఘటాలను 108 మహిళలు ధరించి గురువారం గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా జయహో దుర్గా అంటూ అమ్మవారి నామాలను స్తుతించారు. కార్యక్రమంలో భవానీస్వాములు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

గుమ్మలక్ష్మీపురం: ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులు, ప్రజా సౌకర్యాలు కల్పించేందుకు కనీస అవగాహన కల్పించేందుకు శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. శిక్షణను సభ్యులు సద్వినియోగం చేసుకొని గ్రామాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈఓపీఆర్‌డీ కె.ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవిద్యా సర్వమంగళ దేవి పీఠంలో పూజలు



పూజల్లో పాల్గొన్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర దంపతులు

పార్వతీపురం టౌన్: శ్రీవిద్యా సర్వమంగళ దేవి పీఠంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా దుర్గాష్టమి మహా పర్వదినం సందర్భంగా అమ్మవారి పూజల్లో రాష్ట్ర మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర దంపతులు గురువారం పాల్గొన్నారు. మురపాక కాళిదాసు యాజీ ఆధ్వర్యంలో అమ్మవారి హోమం, కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం గోశాలలో ప్రత్యేక పూజలు జరిపారు.

లక్ష్మీనృసింహస్వామికి ముడుపుల పూజలు



పుష్పాలంకరణలో దర్శనమిచ్చిన లక్ష్మీనృసింహస్వామి

సీతానగరం: మండలంలోని సువర్ణముఖీ నది ఒడ్డున ఉన్న వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో వెలసిన లక్ష్మీనృసింహస్వామికి భక్తులచే గురువారం ముడుపుల పూజలు జరిగాయి. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడం వలన ఉపవాసాలతో భక్తులు నిష్ఠతో పాల్గొని పూజలు నిర్వహించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఉదయం 5 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకూ ముడుపుల పూజలు, అభిషేకాలు చేశారు.

ఐటీ రంగంలో మంచి భవిష్యత్

బలిజిపేట: పదవ తరగతి విద్యార్థులకు పీఎం శ్రీ పాఠశాలలో వృత్తి విద్యా కోర్సులలో ఇస్తున్న శిక్షణ వారికి ఎంతో ఉపయోగపడుతుందని, రానున్న రోజుల్లో ఐటీ రంగంలో మంచి భవిష్యత్ ఉంటుందని బలిజిపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీనివాసరావు తెలిపారు. బలిజిపేట ఉన్నత పాఠశాలలో వృత్తి విద్యా కోర్సులు (ఒకేషనల్) ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని ఆయన గురువారం పరిశీలించారు. పలు సూచనలు చేశారు. ఐటీ అండ్ ఐటీ ఎస్ ట్రేడ్‌కు చెందిన విద్యార్థులు దీనిలో పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో వృత్తి విద్య ఉపాధ్యాయుడు సుధాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీ సూర్యపీఠంలో చండీ హోమం

పార్వతీపురం టౌన్: శ్రీ సూర్యపీఠంలో మహాష్టమి సందర్భంగా గురువారం చండీ హోమం నిర్వహించారు. ఆదిత్య పంచాయతన క్షీరాభిషేకం, సౌర అరుణ పారాయణాలు, నవదుర్గా పూజ నిర్వహించారు. విశ్వశాంతి మంత్ర హోమం లోక కళ్యాణార్థం, సకాల వర్ష ప్రాప్తికి ప్రజల ఆరోగ్య సిద్ధికి చండీ హోమం నిర్వహించామని వేమకోటి నరహరి శాస్త్రి తెలిపారు. యాగ పూర్ణాహుతి అనంతరం నారాయణ సేవ చేశారు.

బంతి సాగుకు అదును ఇదే...

● ఉద్యానవన శాఖాధికారి అమరేశ్వరి



తుమరాడలో సాగులో ఉన్న బంతి తోట

పాలకొండ రూరల్: పెరటిసాగుతో పాటు ఉద్యానవన పంటల్లో భాగంగా బంతితోటల సాగుకు ప్రస్తుత వర్షాకాల సీజన్ అనుకూలమని ఉద్యానవన శాఖాధికారి టి.అమరేశ్వరి అన్నారు. పూల మొక్కల సేద్యానికి ప్రస్తుత సీజన్ అనుకూలంగా ఉంటుందని చెప్పారు. ముఖ్యంగా బంతి తోటల పెంపకానికి నీరు త్వరగా ఇంకిపోయే స్వభావం ఉన్న అన్ని రకాల నేలలు అనుకూలమని సూచించారు. సారవంతమైన గరప నేలలు బంతిసాగుకు అత్యంత అనుకూలమన్నారు. ఈ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా బంతి సాగు చేపడుతుంటారని చెప్పారు. మహిళలు పెరటి సాగు విధానంలో భాగంగా సాగు చేసి ఆర్థికంగా లాభపడవచ్చన్నారు. ఈ తరహా రైతులను ప్రోత్సహించేందుకు లూజ్ ఫ్లవర్ కల్టివేషన్ పేరిట హెక్టార్‌కు రూ.16 వేలను ప్రభుత్వం అందించనుందని తెలిపారు. ఈ నేపథ్యంలో సాగుకు సంబంధించి పలు సలహాలు, సూచనలు చేశారు.

విత్తే పద్ధతి...

ఎకరానికి సరిపడా నారు పెంచడానికి 800 నుంచి 1000 గ్రాముల విత్తనాలు అవసరం అవుతాయి. విత్తనాలను ఎత్తైన మడులు తయారు చేసి విత్తుకోవాలి. మడులు తయారు చేసే సమయంలో ఒక చదరపు మీటరకు బాగా చివికిన పశువుల ఎరువు 8 నుంచి 10 కిలోలు వేయాలి. విత్తడానికి మొదలు ఫాలిడాల్ పొడి, ఫ్లోరోఫైరిఫాస్ చల్లితే చీమలు, చెద నుంచి రక్షణ పొందవచ్చు. సాధారణంగా 5 నుంచి 7 రోజుల్లో విత్తనాలు మొలకెత్తుతాయి. వర్షాకాలం, శీతాకాలం, వేసవి పంటగా కూడా బంతి మంచి దిగుబడులను అందిస్తుంది. నెల వయసు లేదా 3 నుంచి 4 ఆకులు గల మొక్కలు నాటడానికి అనుకూలంగా ఉంటాయి. నారు సాయంత్రం వేళల్లో నాటుకుంటే బాగా పాతుకుపోతాయి. 30 – 40 సెంటీమీటర్ల దూరంలో ఆఫ్రికన్ బంతి, ఫ్రెంచ్ బంతి మొక్కలను 20 – 20 సెంటీమీటర్ల దూరంలో నాటుకోవాలి. దీనివల్ల పూల దిగుబడి అధికంగా ఉంటుంది.

యాజమాన్యం...

చివరి దుక్కిలో ఎకరానికి 20 టన్నుల చొప్పున చివికిన పశువుల ఎరువు వేసి దున్నడం వల్ల భూసారం పెరుగుతుంది. దీంతో పాటు 20 నుంచి 40 కిలోల నత్రజని, 80 కిలోల భాస్వరం, 80 కిలోల పొటాష్ వంటి ఎరువులు వేయాలి. నాటిన 37 రోజుల తర్వాత 20 నుంచి 40 కిలోల నత్రజని వేసి పైపాటుగా నీటి తడులు అందించాలి. 55 – 60 రోజుల కాలంలో పూత దశలో నేలలో తగినంత తేమ ఉండేలా చూడాలి. అలాగే ప్రతి దశలో మొక్కకు నీటిఎద్దడి లేకుండా చూడడం వల్ల లాభాలు అధికంగా ఉంటాయి. బంతి పువ్వు బాగా విచ్చుకున్న తర్వాత కోయడం మంచిది. అది కూడా ఉదయం గాని సాయంత్రం గాని కోయాలి. కోసే ముందు నీటి తడులు ఇవ్వడం వల్ల పువ్వు తాజాదనం తగ్గిపోకుండా ఎక్కువ కాలం ఉంటుంది.



పెరటి తోటల్లో భాగంగా బంతి సాగులో నిమగ్నమైన మహిళలు (ఫైల్)

చీడ పీడల నివారణ ...

పెద్ద, పిల్ల పురుగులు మొగ్గలను ఆశించి నష్ట పరుస్తాయి. వీటి నివారణకు లీటరు నీటికి మోనోక్రోటోఫాస్ 1.5 మిల్లీలీటర్లు లేదా మలాథియాన్ 2 ఎం.ఎల్, లేదా డైమిథోయేట్ రెండు ఎం.ఎల్ కలిపి 15 రోజుల వ్యవధిలో సరిపడా పిచికారీ చేయాలి. అలాగే తామర పురుగులు పిల్ల, తల్లి పురుగులు ఆకులు, పూల నుంచి రసాన్ని పీల్చివేస్తాయి. దీని వల్ల ఆకులపై తెల్లని మచ్చలేర్పడతాయి. వీటి నివారణకు మోనోక్రోటోఫాస్ 1.5 ఎం.ఎల్ లేదా డైమిథోయేట్ 2 ఎం.ఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. కీటకాల గుడ్ల నుంచి వెలువడిన చిన్న లార్వాలు మొగ్గ తొలిచే పురుగులుగా ఏర్పడి ఇవి పువ్వు భాగాన్ని తింటాయి. దీని నివారణకు కార్బియల్ 3 గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

జాగ్రత్తలు వహించాలి..



బంతి పంటను రక్షించుకోవడానికి జాగ్రత్తలు వహించాలి. నేలలో తడి ఎక్కువగా ఉన్నా, వెచ్చని వాతావరణంలో తెగుళ్లు వ్యాపిస్తాయి. దీని వల్ల మొలకెత్తుతున్న లేతమొక్కలు చనిపోతాయి. వీటి నివారణకు మడులను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు లీటర్ నీటిలో రెండు గ్రాముల కాప్టాన్ లేదా గ్రాము కార్బండిజమ్ లేదా మూడు గ్రాములు కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి పిచికారీ చేయాలి. తేమతో కూడిన వెచ్చని వాతావరణంలో ఆకుమచ్చ తెగులు ఆశించే అవకాశం ఉంది. దీని నివారణకు లీటర్ నీటిలో 2.5 గ్రాముల మాంకోజెబ్ కలిపి పిచికారీ చేయాలి. తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు ఆర్జించే బంతి సాగుకు ప్రస్తుత సీజన్ అనువైనది.

– తమ్మినేని అమరేశ్వరి,
ఉద్యానవన శాఖాధికారి, పాలకొండ

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● కేంద్ర బృంద సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రబృంద సభ్యులు సస్యప్పన్, సలీమ్‌కుమార్

పాలకొండ రూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని ఎన్‌ఎల్‌ఎం బృంద సభ్యులు సస్యప్పన్, కేజీ సలీమ్‌కుమార్ కోరారు. మండలంలోని అంపిలిలో గురువారం వీరు పర్యటించి, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీశారు. అనంతరం వైస్ ఎంపీపీ వాకముడి అనిల్‌కుమార్, సర్పంచ్ లోలుగు విశ్వేశ్వరరావు నేతృత్వంలో స్థానిక సచివాలయంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ, హౌసింగ్, రోడ్లు, భవనాలు, హార్టీకల్చర్, తదితర విభాగాలకు సంబంధించిన పథకాలపై చర్చించారు. కార్యక్రమంలో ఏఈ మాధవరావు, ఏపీఓ ఈశ్వరమ్మ, ఏపీఎం సూరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బౌరోతుకు సన్మానం



శంకరరావు మాస్టారును సత్కరిస్తున్న నిర్వాహకులు

పాలకొండ రూరల్: వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైనప్పటికీ సాంస్కృతిక, జనపద కళలపై ఉన్న మక్కువతో ఎన్నో ప్రదర్శనలు ఇస్తున్న పట్టణానికి చెందిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు బౌరోతు శంకరరావును గురువారం సన్మానించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా శంకరరావు మాస్టారు కోటదుర్గమ్మ దేవస్థానం ప్రాంగణంలో ప్రదర్శించిన సత్యహరిశ్చంద్ర నాటకంలో కాటికాపరిగా అభినయించి కళా ప్రేమికుల ప్రశంసలు అందుకున్నారు. ఈ క్రమంలో ఆయన్ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పట్టణ పౌరహక్కుల సంఘ నిర్వాహకులు కనపాక చౌదరినాయుడు, ఏపీ రైతు సంఘ జిల్లా అధ్యక్షులు బుడితి అప్పలనాయుడు, ఉత్తమ ఉపాధ్యాయులు కె.జనార్దనరావు, మల్లేశ్వరావు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి తుషార్‌రావుకు పూలమొక్క అందిస్తున్న డీఎస్పీ, సీఐ

పాలకొండ రూరల్: ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి గేదల తుషార్‌రావు పాలకొండ మీదుగా వంగర మండలం రుసింగిలో గల తమ బంధువుల ఇంటికి గురువారం వస్తూ పాలకొండలో కొంత సమయం గడిపారు. ఈ క్రమంలో స్థానిక న్యాయవాదుల బార్ అసోషియేషన్ సభ్యులతో పాటు డీఎస్పీ ఎం.రాంబాబు, సీఐ ఎం.చంద్రమౌళి, తదితరులు న్యాయ మూర్తిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

వీరఘట్టం: మండలంలోని రేగులపాడు కేజీబీవీలో అసిస్టెంట్ కుక్ పోస్టుకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ ఆర్. ఆనందరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తుతో పాటు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలను ఈ నెల 15వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు ఎంఈఓ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

పనులు గుర్తిస్తున్నాం..

భామిని: ఈ నెల 14 నుంచి 21 వరకు జరగనున్న పల్లె పండగలో భాగంగా పనులను గుర్తిస్తున్నట్లు ఎంపీడీఓ జి.చంద్రరావు, ఈఓపీఆర్‌డీ జి.కృష్ణారావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వెల్ఫేర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్మాణాలు చేపట్టడానికి వీలుగా వీధి కాలువలు, డ్రెయిన్స్, లింక్ రోడ్ల పనులు గుర్తించాలని సూచించారు. హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్‌నాయుడు లబ్ధిదారులకు బిల్లులు వెంటవెంటనే చెల్లిస్తామన్నారు.

మద్యం షాపులకు దరఖాస్తుల స్వీకరణ గడువు పెంపు

సీతానగరం: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం పరిధిలో ఉన్న మద్యం షాపులు నిర్వహణ కోసం అర్జీదారుల నుంచి దరఖాస్తుల స్వీకరణ శుక్రవారం సాయంత్రం 7 గంటల వరకూ గడువు పెంచుతూ ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసిందని సీఐ డి.పద్మావతి అన్నారు. ఈ మేరకు ఆమె గురువారం మాట్లాడుతూ ఇప్పటికి 173 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. అందులో సీతానగరం 45, గరుగుబిల్లి 75, బలిజిపేట 53 దరఖాస్తులు చొప్పున ఈ నెల 9నాటికి వచ్చాయన్నారు. మద్యం షాపులు నిర్వహించడానికి ఆసక్తి కలిగిన వారు ఇంకా ఎవరైనా శుక్రవారం సాయంత్రం 7 గంటలలోగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 14న ఉన్నతాధికారుల పర్యవేక్షణలో డ్రా తీయనున్నామని, 16వ తేదీ నుంచి మద్యం షాపులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

పార్వతీపురం టౌన్: అడ్డాపుశీల గ్రామంలో నవంబర్ 1 నుంచి మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్‌ఆర్‌ఐ మోహన్ సుదీర్ పట్నా తెలిపారు. టైలరింగ్‌లో నైపుణ్యత కలిగిన వారి ఆధ్వర్యంలో శిక్షణ ఇప్పించనున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి గల మహిళలకు శిక్షణ అందజేస్తామని తెలిపారు.

కోర్కెలు తీర్చే కొంగుబంగారం మాలతమ్మ

● ఏజెన్సీ ప్రజలతో దశాబ్దాలుగా పూజలందుకుంటున్న అమ్మవారు
● అమ్మను దర్శించుకుంటే ప్రమాదాలు జరగవని భక్తుల విశ్వాసం



నేరేడువలసలో పూజలందుకుంటున్న మాలతమ్మ తల్లి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం, ఏజెన్సీ ప్రజల ఆరాధ్య దైవం మాలతమ్మ తల్లి. కురుపాం – గుమ్మలక్ష్మీపురం మన్యం ప్రాంతానికి ముఖ ద్వారంలా ఉండే గొటివాడ పంచాయతీ నేరేడువలసలో వెలసిన మాలతమ్మ తల్లి భక్తుల కొంగుబంగారంగా, గిరిజన ప్రజల ఆరాధ్యదైవంగా ఎన్నో దశాబ్దాలుగా పూజలందుకొంటోంది. గిరిజనులకు తమ దైనందిన జీవితంలో ప్రతీ శుభకార్యానికి ముందుగా మాలతమ్మను దర్శించుకుని పూజలు చేయడం ఆనవాయితీ. మైదాన ప్రాంతాల నుంచి ప్రతీ ఆది, మంగళ, బుధవారాల్లో వందలాది మంది భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. విజయదశమిని పురస్కరించుకుని ఈ నెల 3వ తేదీ నుంచి ఆలయం వద్ద శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.



మాలతమ్మ ఘటాల ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్న కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

యాభై ఏళ్ల క్రితం వెలసిన మాలతమ్మ

సుమారు 50 ఏళ్ల క్రితం ఏజెన్సీ ప్రాంతాలకు సరైన రహదారి సౌకర్యం ఉండేది కాదు. నేరేడుకొండ (నేరేడు వలస) ప్రాంతంలో వాహనాలు ఎక్కువగా ప్రమాదాలకు గురయ్యేవి. కారణం లేకుండానే తరచూ ప్రమాదాలు జరుగుతుండటంపై గిరిజనుల్లో ఆందోళన నెలకొంది. ఈ సమయంలో నేరేడువలస గ్రామానికి చెందిన గిరిజనుడు సింగన్నకు అమ్మవారు కలలో కనిపించి నేరేడు కొండ రహదారి పక్కన తాను వెలిశానని, తన పేరు మాలతమ్మని, తనను పూజిస్తే ప్రమాదాలు జరగవని చెప్పింది. మరునాడు గిరిజన ప్రజలు ఆ స్థలానికి వెళ్లి చూడగా అమ్మవారు రాయి రూపంలో దర్శనమిచ్చినట్లు కథనం ప్రచారంలో ఉంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు అమ్మవారికి పూజలు చేపడుతున్నారు. ఇప్పటికీ నేరేడువలస గ్రామానికి చెందిన సింగన్న వంశీయులే అమ్మవారిని కొలుస్తుండగా గొటివాడ, నేరేడువలస గిరిజన గ్రామస్తులే ఉత్సవాలు, ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నారు.

అంచెలంచెలుగా అభివృద్ధి

కురుపాం మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మాలతమ్మ అమ్మవారి గుడిని స్థానిక వర్తకులు, ఆలయ కమిటీ సభ్యులు కలిసి అంచెలంచెలుగా అభివృద్ధి చేస్తున్నారు. ఏటా విజయదశమికి వేల సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

వ్యసనాలకు అలవాటు పడొద్దు..



గిరిశిఖర గ్రామల్లో యువతకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

కొమరాడ: గిరిజన యువత సారా, గంజాయి, ఆన్‌లైన్ గేమ్స్ వంటి చెడ్డ అలవాట్లకు గురి కావొద్దని ఎస్ఐ కె.నీలకంఠం అన్నారు. కొమరాడ మండలంలోని ఎజెన్సీ గ్రామాలైన జొప్పంగి, బెడ్డ తదితర గ్రామాల్లో యువతకు వీటిపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు ఎక్కువగా సారాకు అలవాటు పడి విలువైన జీవితాలు నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించరాదని సూచించారు. గంజాయి, సారా తయారీకి పాల్పడవద్దని హెచ్చరించారు. విద్యపై యువత ఆసక్తి చూపాలని కోరారు.

14 నుంచి పల్లె పండగ

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 14 నుంచి గుమ్మలక్ష్మీపురం మండలంలో పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు, పంచాయతీరాజ్ జేఈ కె.మురళీధర్ తెలిపారు. గురువారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా రూ.1.11 కోట్లతో 30 సీసీ రోడ్ల పనులు ఆయా గ్రామాల్లో చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే యూనియన్ బ్యాంకు నుంచి గడ్డికాలనీ లింకు రోడ్డును రూ.40 లక్షలతో, దొరజమ్ము నుంచి బొడ్లగూడ వరకు రూ.1.10 కోట్లతో బీటీ రోడ్డును, లప్పటి నుంచి వాడబాయి గ్రామానికి రూ.2.8 కోట్లతో బీటీ రోడ్డును నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పనులన్నింటికీ ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరైనట్లు చెప్పారు.

తాగునీటికి ఇబ్బందులు

జియ్యమ్మవలస: మండల కేంద్రంలో తాగునీటికి ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఐదారు రోజుల నుంచి గ్రామంలో తాగునీరు సరఫరా కాక అవస్థలు పడుతున్నామని సచివాలయ కార్యదర్శిని గురువారం స్థానికులు ప్రశ్నించారు. వర్షం నీరు పైపులైన్‌లో కలిసి ఎరుపు రంగుగా మారి కలుషితం అవుతుందని మహిళలు వాపోయారు. గ్రామంలో తాగునీటికి ఇబ్బంది లేకుండా పైపులైన్లకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఇదే విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భరత్‌చంద్ర వద్ద ప్రస్తావించగా మండల కేంద్రంలో తాగునీటి సమస్యను గుర్తించామని పైపులైన్లకు మరమ్మతులు చేపట్టి నీరు సరఫరా చేస్తామని తెలిపారు.

ధరల అదుపులో ప్రభుత్వం విఫలం

సీతంపేట: ఆకాశన్నంటిన నిత్యావసరాల ధరలను అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.తిరుపతిరావు గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. నూనె, పప్పులు, అల్లం, వెల్లుల్లి, కూరగాయాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని పేర్కొన్నారు. ప్రభుత్వం మద్యం ధరలు తగ్గించి, సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో వైఫల్యం చెందిందన్నారు. ఇటువంటి తరుణంలో మాది మంచి ప్రభుత్వం అని ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. తక్షణమే ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

దుర్గమ్మా.. శతకోటి దండాలమ్మా..



పాలకొండ రూరల్: పూజలు అందుకుంటున్న పోలమాంబ



పాలకొండ రూరల్: మహిషాసుర మర్ధిని వద్ద భక్తుల పూజలు



వీరఘట్టం: ప్రత్యేక అలంకరణలో వీరఘట్టం కోటదుర్గ

దసరా సందర్భంగా శరన్నవరాత్రులు ఉత్సవాలు వాడవాడలా ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా దుర్గాదేవికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. దుర్గమ్మా...శతకోటి దండాలమ్మా అంటూ భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. పలుచోట్ల సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

– వీరఘట్టం/పాలకొండ/పాలకొండ రూరల్



పాలకొండ: దుర్గాదేవి అవతారంలో కోటదుర్గమ్మ



పాలకొండ రూరల్: అష్టాదశ శక్తి స్వరూపిణిల పూజల్లో నిమగ్నమైన భక్తులు

13 నుంచి పవిత్రోత్సవాలు

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి, కోదండరామస్వామి ఆలయాల్లో ఈ నెల 13 నుంచి పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వీవీ సూర్య నారాయణ గురువారం తెలిపారు. పవిత్రోత్సవాల్లో భాగంగా 12న సాయంత్రం 6గంటలకు విశ్వక్షేన పూజ, పుణ్యాహవాచనం తదితర పూజా కార్యక్రమాలతో ప్రారంభం అవుతుందన్నారు. ఈ నెల 15న మంగళవారం పవిత్ర నాగావళి నదీ తీరంలో శ్రీ చక్ర తీర్థ స్నానం నిర్వహించనున్నట్లు తెలిపారు. పవిత్రోత్సవాల్లో భక్తులు అధికంగా పాల్గొనాలని కోరారు.